

దర్గాను దర్శించుకుంటున్న ఎంపీ రాములు

## గుండూర్‌లో దర్గాను దర్శించుకున్న ఎంపీ

కల్వకుర్తి, జనవరి 25: కల్వకుర్తి మండలం గుండూర్‌లోని దర్గాను ఉర్సు సందర్భంగా గురువారం నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను దర్గా కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంతోశ్‌కుమార్, రామేశ్వర్‌రావు, బాలేమియా, గ్రామస్తులు ఉన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం



రైతువేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

నాగర్‌కర్నూల్, జనవరి 25: మండలంలోని మంతటిలో గురువారం ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారిలు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. జిల్లా పరిషత్ నుంచి మంజూరైన రూ.44 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం, రూ.20 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ భవ నం, రైతువేదిక, వైకుంఠధామంతోపాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభిచారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీశైలం, నాగమణి, నాగయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

## దర్గాలో మాజీ ఎమ్మెల్యే మర్రి ప్రార్థనలు



దర్గానుద ర్శించుకుంటున్నమా జీ ఎమ్మెల్యే మర్రి

నాగర్‌కర్నూల్, జనవరి 25: మండలంలోని మంతటిలో గల మహబూబ్‌సుహానీ దర్గాను గురువారం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగర్‌కర్నూల్ పట్టణంలో ప్రొస్టీ వ్యాపారి తీగల వెంకట్రాములు దశదినకర్మలో పాల్గొని ఆయన చిత్ర పటానికి నివాళుల ర్పించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పనాభాస్కర్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకాని శ్రీనివాస్‌యాదవ్, నాయకులు గంగాధర్, భాస్కర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక గంధోత్సవం

- మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

కల్వకుర్తి, జనవరి 25: మత సామరస్యానికి ప్రతీక గంధోత్సవమని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. కల్వకుర్తి మున్సిపాలిటీకి చెందిన బతుకమనెమ్మ నిర్వహించిన జాన్‌పాడ్ సైదులు బాబా దర్గా కందూర్ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం హాజరయ్యారు. కల్వకుర్తి నుంచి జయప్రకాశ్‌నగర్ వరకు నిర్వహించిన గంధోత్సవంలో మున్సిపల్ చైర్మన్ పాల్గొన్నారు. హిందూ, ముస్లింలు కలిసికట్టుగా గంధోత్సవాన్ని నిర్వహించడం చాలాగొప్ప విషయమ



దర్గా వద్ద చాదర్‌స మర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

న్నారు. దర్గా వద్ద చాదర్ సమర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సైదులుగౌడ్, తాహెర్‌అలీ, వంశీయాదవ్, రాకేశ్, ఆనంద్, శివ, సాయి, కిరణ్ పాల్గొన్నారు.

## జిల్లాలో మూడు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు

- కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, జనవరి 25: ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో తాత్కాలికంగా మూడు ఆధార్ కేంద్రాలను గురువారం నుంచి అందుబాటులోకి తెచ్చినట్లు కలెక్టర్ ఉదయ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్ తాసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఆధార్ కేంద్రం వద్ద అధిక సంఖ్యలో ప్రజలు ఆధార్ అప్‌డేట్, కేవైసీ కోసం వస్తున్నారని రద్దీని దృష్టిలో ఉంచుకొని నాగర్‌కర్నూల్ ఎంపీడీవో కార్యాలయం, బిజినేపల్లి తాసీల్దార్, తాడూరు ఎంపీడీవో కార్యాలయాల్లో ఈ నెల 31వ తేదీ వరకు తాత్కాలికంగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 31వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు ఈ ఆధార్ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

నాగర్‌కర్నూల్‌టౌన్, జనవరి 25 : ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులకు గీత, నేత కార్మికులలాగే నెలకు రూ.4,500ల భృతి చెల్లించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆనంద్, సుభాష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# దిగుబడి లేదు.. ధర రాదు

- నెలరోజుల వ్యవధిలో రూ.వెయ్యి తగ్గిన వేరుశనగ ధర
- ఆందోళనలో రైతాంగం



కల్వకుర్తివ్యవ సాయ మార్కెట్‌కుగురు వారంరై తులుతీ సుకువచ్చినవేరు శనగ

కల్వకుర్తి, జనవరి 25 : కల్వకుర్తి మండలం ముకురాల గ్రామానికి చెందిన రైతు రవీందర్ (పేరుమార్చాం)తనకున్న ఐదు ఎకరాల్లో వేరుశనగ సాగుచేశారు. వేరుశనగ విత్తనాలు వేసినప్పుడు కేఎల్ఐ కాలువలో కృష్ణ సాగు నీళ్లు వస్తున్నాయి. సాగునీరు ఉందనే ఉద్దేశంతో 5 ఎకరాల్లో వేరుశనగ విత్తనాలు వేశాడు. విత్తనాలు వేసిన నెలరోజులకు కాలువలో నీళ్లు బంద్ అయ్యాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో తన పొలంలో ఉన్న బోరుబావికి మోటర్ వేసి ప్రతి రోజూ తుంపర పరికరాల ద్వారా వేరుశనగ పంటకు నీరందించాడు. రేయింబవళ్లు పొలం వద్దనే ఉన్నారు. తన కష్టానికి ఫలితం వచ్చిందని సంతోష పడ్డారు. వాతావరణ పరిస్థితుల వల్ల చేను చాలా ఏపుగా పెరిగింది. పంట చేతికి వచ్చింది. చేతిలో చిల్లిగవ్వలేదు. వేరుశనగను పీకి నూర్పిడి చేయడానికి కూలీలకు దాదాపు రూ.40 వేలు అవసరం అవుతున్నాయి. ఇంట్లో ఉన్న కొద్ది పాటి బంగారాన్ని కుదువపెట్టి డబ్బులు తెచ్చుకొని వేరుశనగ పంటను నూర్పిడి చేయించారు. మార్కెట్‌కు సదరు రైతు వేరుశనగను తీసుకువచ్చాడు. తీరా తూకం వేస్తే 5ఎకరాలకు కేవలం 30 క్వింటాళ్ల వేరుశనగ దిగుబడి వచ్చింది. తూకాన్ని చూసి సదరు రైతు కంట్లో కన్నీళ్లు తిరిగాయి. వాతావరణ పరిస్థితుల వల్ల పంట నాణ్యతగా రాకపోవడంతో ధర కూడా తగ్గింది. కేవలం రూ.6400ల చొప్పున 30 క్వింటాళ్ల వేరుశనగను వ్యాపారానికి విక్రయించాడు. ఖర్చులు, కమీషన్, క్యాష్ కటింగ్ పోను సదరు రైతు చేతికి రూ.1,80 లక్షలు వచ్చింది. పంట మొత్తం అమ్మితే పెట్టుబడులకు వచ్చింది. చేసిన కష్టం వ్యర్థమయింది. ఇది కేవలం రవీందర్‌కు వచ్చిన కష్టం కాదు దాదాపు వేరుశనగ సాగు చేసిన ప్రతి రైతుది ఇదే పరిస్థితి.

### రూ.వెయ్యి తగ్గిన వేరుశనగ ధర

గత నెల రోజుల వ్యవధిలో వేరుశనగ ధర దాదాపు రూ.వెయ్యి పైగానే తగ్గింది. నెల రోజుల కిందట వేరుశనగ కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌కు కొద్దికొద్దిగా వస్తున్నప్పుడు గరిష్ఠ ధర రూ.8,500పైగానే ఉంది. రోజురోజు తగ్గుతూ ఈ గురువారం నాటికి రూ.7,200లకు చేరుకున్నది. కనిష్ఠ ధర నూ.5 వేలకు వచ్చింది. సరాసరిగా మాత్రం రూ.6వేల నుంచి రూ.6500 మధ్యను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. పంట తక్కువగా రావడం ఒక ఎత్తయితే.. ధర కూడా ఎక్కువగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల పాటు తాము పడ్డ కష్టం వృథా అయిందని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

### వాతావరణ పరిస్థితుల వల్ల..

వాతావరణ పరిస్థితులు వల్ల వేరుశనగ ఏపుగా పెరగడం వల్ల పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంట చూడటానికి భాగానే ఉన్న భూమిలో వేరుశనగ గింజలు బలంగా ఊరలేదని, నట్టలు ఎక్కువగా వచ్చాయి. అందుకే పంట నాణ్యతగా లేక బరువు చాలా తగ్గింది. ఇదే కారణం చేత ధర కూడా తగ్గుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

### ధాన్యం టెండర్లు వేయడానికి..

కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ ప్రతి ఆది గురువారాల్లో సాగుతుంది. ఈ రోజుల్లో రైతులు తాము పండించిన పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకుస్తారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు మార్కెట్‌కు రావాలి. రైతుల తీసుకువచ్చిన ధాన్యాన్ని చూసి తాము ఇంత ధరకు కొనుగోలు చేస్తామని రహస్య టెండర్ వేయాలి. రైతులు తీసుకువచ్చిన ధాన్యానికి ఎవరైతే ఎక్కువ ధర చెల్లిస్తున్నారో.. సదరు వ్యాపారికి మార్కెట్ అధికారులు అప్పగిస్తారు. సదరు ధాన్యాన్ని తూకం వేసి రైతులు వ్యాపారి డబ్బులు చెల్లిస్తాడు. ఇది మార్కెట్‌లో జరిగే ప్రక్రియ. మార్కెట్‌కు వ్యాపారులు ఎక్కువ మంది వస్తే.. ధరల విషయంలో పోటీ కూడా ఉంటుంది. రైతులకు ధర ఎక్కువ వచ్చే అవకాశం ఉంది. కాకపోతే వ్యాపారులు ఎక్కువ మంది మార్కెట్‌కు రావడం లేదు. టెండర్లు వేయడం లేదు. వచ్చిన ఐదారు మంది వ్యాపారులే టెండర్లు వేస్తున్నారు. మార్కెట్‌కు ధాన్యం ఎక్కువగా వస్తుండటం, వ్యాపారులు తక్కువ మంది వస్తుండడంతో ధాన్యం ధర సహజంగానే తగ్గిపోతుంది. కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో ఇదే జరుగుతుంది. కారణమేమిటంటే.. చాలా మంది వ్యాపారుల మిల్లుల వద్దకే రైతులు తాము పండించిన ధాన్యాన్ని తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. మార్కెట్‌కు తీసుకువస్తే ఖర్చులు పెరుగుతున్నాయి. ఆశించిన ధర రావడం లేదని రైతులు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులంతా మార్కెట్‌కు వస్తే రైతులకు చాలావరకు లాభం జరుగుతుంది. వ్యాపారులను మార్కెట్‌కు తీసుకువచ్చేలా చేయడంలో మార్కెట్ అధికారులు విఫలం అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. గురువారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ ధరల విషయానికి వస్తే.. మార్కెట్‌కు 1,845 కింటాళ్ల వేరుశనగను రైతులు తీసుకువచ్చారు. వేరుశనగ గరిష్ఠ ధర రూ.7,222, కనిష్ఠ ధర రూ.5,002, సరాసరి ధర రూ.6,990కు వ్యాపారులు కొనుగోలు చేశారు. అసలైన విషయం ఏమిటంటే..1,121 క్వింటాళ్ల వేరుశనగను రూ.5,002 నుంచి రూ.6.990 మధ్య కొనుగోలు చేశారు.

### రైతులకు తాగునీటి వసతి

గత గురువారం నిలువనీడలేదు అను శీర్షికన 'నమస్తే తెలంగాణ' రాసిన వార్తకు మార్కెట్ అధికారులు స్పందించారు. రైతుల కోసం తాగునీటిని ఏర్పాటు చేశారు. మినరల్ నీటిని తెప్పించి కుండలలో పోసి ఉంచారు. తాగునీటి సౌకర్యం కల్పించడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా తాము విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా రైతు విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని, రాయితీపై భోజన వసతి కల్పించాలని రైతులు కోరుతున్నారు.

## గణతంత్రవేడుకలకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబు

నాగర్‌కర్నూల్, జనవరి 25: శుక్రవారం నిర్వహించే గణతంత్ర వేడుకలకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. ముఖ్య అతిథులు జెండా ఎగరవేయడంతోపాటు ప్రసంగించేందుకు స్టేజీని ఏర్పాటు చేశారు. పోలీసుల నుంచి వందన స్వీకారం, మార్చ్‌ఫాస్ట్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే స్టాల్స్ సైతం సిద్ధమయ్యాయి. అదేవిధంగా కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయంతోపాటు వివిధ కార్యాలయాలు వేడుకలకు ముస్తాబయ్యాయి. ఉదయం 8:30 గంటలకు ఐడీవోసీలో కలెక్టర్ పతాకావిష్కరణ చేయనున్నారు. అనంతరం 9 గంటలకు పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ జెండా విష్కరణ చేసి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు.



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న ఏర్పాట్లు

# ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రధానం

- అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్
- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం
- జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు

నాగర్‌కర్నూల్, జనవరి 25: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రధానమైనదని అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నాగర్‌కర్నూల్ ఐడీవోసీ ప్రజావాణి మీటింగ్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై అధికారులు, సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. 18 ఏండ్లు నిండిన వారు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు.



కలెక్టరేట్‌లోఅధి కారులు,సిబ్బందిచేప్రతిజ్ఞచేయి స్తున్న అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

### ఓటు ప్రజాయుధం..

ఓటు అనేది ప్రజలకు ఓ ఆయుధం లాంటిదని ఆర్డీవో రాంరెడ్డి అన్నారు. ఓటర్స్‌డే సందర్భంగ గురువారం ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థుతో నిర్వహిం చిన ర్యాలీని జెడ్పీ మైదానంలో ఆయన ప్రారంభించారు. ర్యాలీ పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదుగా పాత కలెక్టరేట్ ఆవరణకు చేరుకొని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభక కనబరిచిన వారికి ఆర్డీవో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్‌బోర్డు నోడల్ ఆఫీసర్ వెంకటరమణ, డీఈవో గోవిందరాజులు, డీపీవో కృష్ణ పాల్గొన్నారు.

### లింగాల మండలంలో..

లింగాల, జనవరి 25 : యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తాసీల్దార్ ఉమ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురష్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ కూడలిలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన యువత తమ పేర్లను ఓటరు జాబితాలు నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం తాసీల్దార్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేఖర్, ఉపాధ్యాయులు వెంకట్‌రాజు, అష్రఫ్,ఆర్ఐ సీతారాం, తిరుపతమ్మ, రమేశ్, సతీశ్ ఉన్నారు.

### ఉప్పునుంతలలో..

ఉప్పునుంతల, జనవరి 25: తాసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తాసీల్దార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్ని ప్రతిజ్ఞ చేశారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలన్నారు.

### కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్, జనవరి 25: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆర్డీవో నాగరాజు ఆధ్వర్యంలో అధికారులు,విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీటీ విష్ణువర్ధన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ గోవింద్‌రెడ్డి, ఆర్ఐ జానయ్య, జూనియర్ అసిస్టెంట్ దుర్గప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, ప్రభుత్వ బాలికల జూనియర్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బల్మూరులో..

బల్మూరు, జనవరి 25: మండలంలోని కొండనాగుల, బల్మూరు, తుమ్మెన్‌పేట, పోలెపల్లి, మంగళకుంటపల్లి, చెన్నారం తదితర గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే ర్యాలీలు నిర్వహించారు. అనంతరం తాసీల్దార్ సలీమొద్దీన్ ఓటు హక్కుపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవన్న, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, జనవరి 25: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో గురువారం విద్యార్థులచే ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ ఎండీ యూసూఫ్‌అలీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ రమేశ్‌నాయక్, హెచ్‌ఎం మద్దిలేటి, గ్రామ కార్యదర్శి నాగశేషి, విద్యార్థులు పాల్గొన్నారు.

### కోడేరులో..

కోడేరు, జనవరి 25: మండల కేంద్రంలో పాఠశాల, కళాశాల విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని అం బేద్కర్ విగ్రహం ఎదుట మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో బాలచంద్రసుజన్ మాట్లాడుతూ ఓటు ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించుకోడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ సైదులు, ఎంపీవో శ్రావణ్‌కుమార్, ఎస్సై శేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

### పెంట్లవెల్లిలో..

పెంట్లవెల్లి, జనవరి 25 : తాసీల్దార్ హిమబిందు ఆధ్వర్యంలో అధికారులు,విద్యార్థులు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం శివాజీ విగ్రహం సమీపంలో విద్యార్థులు,అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు శివన్నగౌడ్, హన్మంతు, జూనియర్ అసిస్టెంట్ ఉమాదేవి,రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, జనవరి 25 : మండల కేంద్రంలో గురువారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు విశిష్టతను వివరిస్తూ నినాదాలు చేశారు. వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తాసీల్దార్ మోహన్, ఎంపీడీవో, ఎంఈవో, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




కల్వకుర్తిలోసీ నియర్‌సిటి జన్లను సన్మానిస్తున్న ఆర్డీవో శ్రీను, తాసీల్దార్ ఇబ్రహీం

## ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి రూరల్, జనవరి 25: ప్రజాస్వామ్య విధానంలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని 18ఏండ్లు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఆర్డీవో శ్రీను పిలుపునిచ్చారు. జనవరి 25 గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి తాసీల్దార్ ఇబ్రహీం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీను మాట్లాడుతూ ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. పట్టణంలోని చౌరస్తాల మీదుగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు సీనియర్ సిటిజన్లను సత్కరించారు. కార్యక్రమంలో డీటీ, ఎలక్షన్ డీటీ, అధికారులు, నాయకులు ఉన్నారు.

### మున్సిపల్ కార్యాలయంలో..

కల్వకుర్తి, జనవరి 25: జాతీయ ఓటర్ దినోత్సవాన్ని గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కమిషనర్ అశ్రిత్‌కుమార్, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

### వెల్దండలో..

వెల్దండ, జనవరి 25: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఓటు ప్రతిజ్ఞ చేశారు. ఓటు హక్కు, బాధ్యతపై విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్ పీవో శివప్రసాద్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజీవ్‌రెడ్డి, అధ్యాపకులు, వలంటీర్లు, బీఎల్‌వోలు ఉన్నారు.

### చారకొండ మండలంలో..

చారకొండ, జనవరి 25: మండల కేంద్రంలో తాసీల్దార్ ప్రమీల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కును 18ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువతకు ఓటరు కార్డు అందజేశారు. అనంతరం చారకొండకు చెందిన సీనియర్ సిటిజన్ ఏమిరెడ్డి అంతిరెడ్డిని తాసీల్దార్ ప్రమీల, డిప్యూటీ తాసీల్దార్ విద్యాధరి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తాసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కుతూరును చూసేందుకు వచ్చి అనంతలోకాలకు..

తిమ్మాజిపేట, జనవరి 25 : కూతురిని చూసేందుకు వచ్చి తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. ఎస్సై భాస్కర్‌రెడ్డి కథనం మేరకు మిడ్జిల్ మండలం కొత్తపల్లికి చెందిన సత్యనారాయణ(50) బుధవారం మోపెడ్‌పై గుమ్మకొండ గ్రామంలో ఉన్న కూతురిని చూసేందుకు వచ్చి గురువారం ఉదయం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా తిమ్మాజిపేట సమీపంలోని కల్వర్టు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తన దగ్గరి నుంచి వెళ్లిన నిమిషాల వ్యవధిలోనే తండ్రి మృతి చేందాడని సమాచారం తెలుసుకున్న కూతురి రోదనలు అందరిని కలచివేశాయి. మృతుడి కుమారుడు శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రెండు దుకాణాల్లో చోరీ

కొల్లాపూర్, జనవరి 25: మండలంలోని సింగోటంలో రెండు దుకాణాల్లో చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు గురువారం తెల్లవారు జామున గ్రామంలో ప్రధాన రోడ్డుపై ఉన్న శ్రీసాయిఎలక్ట్రానిక్ ఎంటర్ ప్రైజెస్, బాలాజీ ఫర్టిలైజర్ దుకాణాల షెటర్లను దుండగులు గునపంతో ఎత్తి చోరీకి పాల్పడ్డారు. శ్రీసాయిఎలక్ట్రానిక్ ఎంటర్ ప్రైజెస్‌లో క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.2 లక్షలు అపహరించినట్లు దుకాణాదారుడు సాయిరాం తెలిపారు. బాలాజీ ఫర్టిలైజర్ షాపు నగదు లేకపోవడంతో వెతికిన ఆనవాళ్లు ఉన్నాయి. కాగా చోరీకి పాల్పడ్డ దుండగుడు స్వెటర్ వేసుకొని ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజ్‌ను ధరించినట్లు సమీపంలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయినట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని ఎస్సై సతీశ్ గురువారం సందర్శించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

బిజినేపల్లి, జనవరి 25: అనుమానాస్పదంగా మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు బిజినేపల్లికి చెందిన రజియా బేగం(32) ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, రెండవ ఎస్సై గోపాల్‌నాయక్ ఘటనా స్థలాని చేరుకొని పరిశీలించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని తరలించారు. మృతురాలి తమ్ముడు రబ్బాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త చాంద్‌పాష, ఇద్దరు సంతానం ఉన్నారు.

## కలుపు మిషన్‌లో పడి తెగిన కాలు

తిమ్మాజిపేట, జనవరి 25 : మండల కేంద్రంలో కలుపు తీసే యంత్రంలో పడి ఓ రైతు కాలు తెగింది. స్థానికుల కథనం మేరకు మండల కేంద్రానికి చెందిన రైతు రాంమూర్తి గురువారం మరొకరి పొలంలో యంత్రంతో కలుపు తీస్తుండగా ప్రమాదవశాత్తు ఎడమకాలు అందులో చిక్కుకొని పాదం పైవరకు తెగింది. అక్కడున్న వారు వెంటనే అతడిని చికిత్స కోసం జడ్చర్లలోని ఓ ప్రవేటు దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

## ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం

కల్వకుర్తి రూరల్, జనవరి 25: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం, క్షేమదాయకమని కల్వకుర్తి డీఎం సుభాషిని అన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని, సంస్థను ఆదరించాలని కోరారు. గురువారం కల్వకుర్తి డిపోలో మధ్యాహ్నం 12గంటల నుంచి ఒంటిగంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికులు, వ్యాపారులు, ఉద్యోగుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

వెల్దండ, జనవరి 25: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బైరాపూర్ గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు దార్ల కుమార్ డిమాండ్ చేశారు. గురువారం వెల్దండ మండలం బైరాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు ఇస్తాం, కరెంట్ బిల్లు, రుణాల మాఫీ చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

## సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

నాగర్‌కర్నూల్‌టౌన్, జనవరి 25 : జిల్లా కేంద్రంలోని సీతారామస్వామి ఆలయంలో పుష్యమాసం పౌర్ణమి సందర్భంగా గురువారం భక్తులు రమాసహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు కందాడై వరదరాజన్ అయ్యంగార్ మాట్లాడుతూ ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి రోజు భక్తులు వ్రతాలు నిర్వహిస్తుంటారని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అన్నప్రసాద కమిటీ సభ్యులు రవీందర్, రాములు, మల్లేశ్, యాదగిరి, రమాదేవి, శారద, నందకిశోర్, సాయి భక్తులు, నిత్య విష్ణు సహస్ర పారాయణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.